

## జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా మంగపతిరావు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంగపతిరావు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా యు.మంగపతిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంగపతిరావు సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా నియమితులయ్యారు. జిల్లా పరిశ్రమల అధికారిగా ఇప్పటివరకూ పనిచేసిన ఉయ్యాల ఆదిశేషు డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై ఏలూరు జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా నియమితులయ్యారు.

# కోడి ఆగేనా..!



**కోడి పందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలులో పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రతియేటా విఫలమవుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పుడు మరోసారి కోడి పందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు అమలయ్యేనా అంటూ చర్చలు సాగుతున్నాయి. కోడి పందేలను అడ్డుకుంటామంటూ కలెక్టర్, ఎస్‌పి నుంచి కిందిస్థాయి అధికారులు వరకూ ప్రకటనలు గుప్పించడం, పండుగ మూడు రోజులు మౌనముద్ర పాటించడం ప్రతియేటా పరిపాటిగా మారిపోయింది.**

- ప్రతియేటా అమలు కాని హైకోర్టు ఉత్తర్వులు
- పండుగ మూడు రోజులు పోలీసు, రెవెన్యూ అధికారులు మౌనముద్ర
- ఉమ్మడి జిల్లాలో గతేడాది 400కుపైగా బరుల్లో పందేల జోరు
- యథేచ్ఛగా గుండాట, మూడు ముక్కలాట
- ఈసారైనా పందేలకు అడ్డుకట్ట వేయాలని అంతా ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రతియేటా 400కుపైగా బరుల్లో కోడి పందేలు సాగుతున్నాయి. దాదాపు రూ.200 కోట్లకుపైగా సొమ్ము చేతులు మారుతోంది. ప్రధాన రహదారులకు పక్కగా టెంట్లు వేసి, ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో కోడిపందేలు జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంటోంది. కోడి పందేలపై గతంలో కొంతమంది హైకోర్టును ఆశ్రయించగా పందేలను అడ్డుకోవాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా కోర్టు ఆదేశాలను అమలు చేసిన పరిస్థితి లేదు. కోడి పందేలతోపాటు గుండాట, మూడు ముక్కలాట సైతం యథేచ్ఛగా బరుల వద్ద సాగుతున్నాయి. సామాన్య ప్రజానీకం ఎంతోమంది పందేలకు ఆకర్షితులై జేబులు ఖాళీ చేసుకుని రోడ్డున పడుతున్నారు. ఈ ఏడాది సైతం కోడిపందేలకు పందెంరాయుళ్లు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. ఇప్పటికే బరుల ఏర్పాటుకు స్థలాల ఎంపికతోపాటు, అతిథులకు ఆహ్వానాలు సైతం పంపించేశారు. పందెం కోళ్లకు పెద్దఎత్తున తర్ఫీదు ఇస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పందేలు పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భీమవరం, కాళ్ల, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, ఆకివీడు, ఉండి వంటి మండలాలతోపాటు ఏలూరు జిల్లాలో పెదవేగి, జంగారెడ్డిగూడెం, దెందులూరు, ఉంగుటూరు వంటి అనేక మండలాల్లో పందేలకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈసారి 300కుపైగా బరుల్లో పందేలు నిర్వహించనున్నట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. దీనికోసం పోలీసులకు, రెవెన్యూ అధికారులకు పెద్దఎత్తున మాముళ్లు సైతం ముట్టజెప్పేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల తరుణంలో ప్రభుత్వం కోడిపందేలను మరింత ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా పందెంరాయుళ్లు మరింత రెచ్చిపోతున్నారు. ఏలూరు, భీమవరం వంటి పట్టణాల్లో ఇప్పటికే ముందస్తుగా హోటల్ గదులు సైతం బుక్ చేసినట్లు తెలుస్తోంది. సంప్రదాయం ముసుగులో కొంతమంది పందెంరాయుళ్లు వీటిని ప్రోత్సహిస్తున్నారు. వీరికి రాజకీయ నేతల అండ ఉండటంతో ఆడింది ఆట.. పాడింది పాట అన్నట్లు సాగుతోంది. పోలీసుల బైండోవర్ కేసులు, బరుల తొలగింపు లెక్కలన్నీ కేవలం కోర్టుకు చూపించడానికే తప్ప కోడి పందేలను నిరోధించడానికి కాదని స్పష్టంగా అర్థమవుతోంది. సంక్రాంతి వస్తుండటంతో మరోసారి కోడిపందేలను అడ్డుకుంటామంటూ అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా కన్పిస్తోంది. బరులు నిర్వహించే నిర్వాహకులను పిలిపించుకుని పోలీసులు తమ వాటాలు మాట్లాడుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈసారైనా హైకోర్టు ఆదేశాలను అమలు చేసి కోడిపందేలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

## సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభం

- వివిధ జిల్లాల నుంచి 65 మంది ప్రతినిధులు హాజరు
- తొలిరోజు వివిధ అంశాలపై సుదీర్ఘ చర్చలు
- రాజకీయ, ప్రజాసమస్యలపై మీడియాతో మాట్లాడిన పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబి, బివి.రాఘవులు
- రెండు రోజుల సమావేశాల్లో పలు తీర్మానాలు చేయనున్న రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజరైన అగ్రనాయకులు

సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీ హోటల్ కన్వెన్షన్ హాలులో రెండు రోజులపాటు జరగనున్న రాష్ట్ర కమిటీ సమావేశాలు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 65 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. తొలిరోజు ఉదయం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం అనంతరం రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. పలు రాజకీయ అంశాలతోపాటు, ప్రజా సమస్యలపై కమిటీలో విస్తృత చర్చలు సాగాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలు, పరిణామాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర కమిటీ సమావేశాలకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబి, బివి.రాఘవులు కేంద్ర, రాష్ట్ర రాజకీయ అంశాలతోపాటు, ప్రజాసమస్యలపై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మత విశ్వాసాలతో బిజెపి రాజకీయం చేస్తుందని ఎంఎ.బేబి విమర్శించారు. అయోధ్యలో రాముడి పేరుతో రాజకీయాలు నడుపుతుందన్నారు. మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అయోధ్యలో రాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ట పేరుతో బిజెపి హడావుడి చేస్తుందన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో చోటుచేసుకున్న భద్రతా లోపాలపై ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా బయటకు గెంటేసిందన్నారు. ప్రతిపక్షాలు లేకుండా కీలకమైన బిల్లులను ఆమోదించుకుందని, ఇది ప్రజాస్వామ్యంలో ఏమాత్రం సరికాదని అన్నారు. మరో పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ మీడియా గొంతు నులిమే చట్టాలను తేవడమే కాకుండా, కఠిన నిబంధనలను తెచ్చిందన్నారు. వాక్ స్వాతంత్రం మాదిరిగానే, మీడియా స్వాతంత్రం ఉండాలన్నారు. న్యూస్‌క్లిక్, పలు పోర్టల్స్‌లో పని చేసే జర్నలిస్టులపై కేంద్ర ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతుందన్నారు. సిపిఎం దీన్ని తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మోడీ తరహాలోనే జగన్ నిరంకుశంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించకపోతే వైసిపి ప్రభుత్వ పతనం ఖాయమన్నారు. ఎస్మా పేరుతో బెదిరింపులు వంటివి మానుకుని చర్చలతో అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పొత్తులకు ఇంకా సమయం ఉందని, అప్పటి పరిస్థితిని బట్టి నిర్ణయం ఉంటుందన్నారు. బిజెపి పొత్తులో ఉన్న పార్టీలకు దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవితోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

# నోటీసులు తీసుకోం.. విధులకు హాజరుకాబోం

**అధికారులకు తెగేసి చెప్పిన అంగన్వాడీలు**

**సుమారు 3 వేల మందికి రిజిస్టర్ పోస్టులో నోటీసుల జారీ**

**సమ్మె విరమించేది లేదంటూ నినదించిన అంగన్వాడీలు**

ప్రజాశక్తి - భీమవరం

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మెను అణచివేసేందుకు ప్రభుత్వం కుట్ర ముమ్మరం చేసింది. ఇప్పటికే అంగన్వాడీ వ్యవస్థను అత్యవసర సేవల పరిధిలోకి తీసుకొచ్చి ఎస్మా ప్రయోగించింది. దీనిపై ఉవ్వెత్తున నిరసనలు ఎగసిపడుతున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా అంగన్వాడీలపై చర్యలు తీసుకునేందుకు ఒడిగట్టింది. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు నాలుగేళ్లుగా వైసిపి ప్రభుత్వంతో పోట్లాడుతూనే ఉన్నారు. అయినా ప్రభుత్వం పరిష్కారంలో కాలయాపన చేసింది. ఈ నేపథ్యంలో అంగన్వాడీలు సమ్మె బాట పట్టారు. నెల రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించిన దాఖలాలు లేవు. యూనియన్ నేతలతో అంగన్వాడీల సమస్యల పట్ల నామమాత్రంగా చర్చలు జరిపి చేతులు దులుపుకున్నారు. దీంతో అంగన్వాడీలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. అయితే ప్రభుత్వం ఎక్కడికక్కడ అంగన్వాడీలను కట్టడి చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. నిరసనలు, ఆందోళనలు చేయకుండా నిర్బంధాన్ని ప్రయోగించి, అరెస్టులు చేస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తోంది. ఇక్కడితో ఆగకుండా వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. అయినా అంగన్వాడీలు మొక్కవోని దీక్షతో రిలే నిరాహార దీక్షలు చేపట్టి నిరసన కొనసాగిస్తున్నారు.

**కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశం**

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించిన ప్రభుత్వం తాజాగా వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని నిర్ణయించింది. విధులకు ఎందుకు హాజరు కాలేదో చెప్పాలని, నోటీసులు ఇవ్వాలని, పది రోజుల్లో సంతృప్తికర సమాధానం ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు పంపింది. దీంతో కలెక్టర్ మాత శిశు, స్త్రీ, సంక్షేమ శాఖకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో అంగన్వాడీలకు నోటీసులు అందించాలని, 10 రోజుల్లో నోటీసులపై సమాధానం చెప్పాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మొగల్తూరులో అంగన్వాడీ కార్యకర్త ఇంటి గేటుకు నోటీసులు అంటించిన అధికారులు

**నోటీసులు తీసుకునేందుకు అంగన్‌వాడీలు నిరాకరణ**

షోకాజ్ నోటీసులు తీసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు నిరాకరించారు. ప్రభుత్వం నుంచి ఐసిడిఎస్ అధికారులపై తీవ్ర ఒత్తిడి ఉన్న నేపథ్యంలో ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడీల సమ్మె శిబిరాలకు వెళ్లి నోటీసులందించే ప్రయత్నం చేశారు. వారు మాత్రం నోటీసులు తీసుకునేందుకు నిరాకరించారు. నోటీసులు తీసుకునేది లేదని, విధులకు హాజరయ్యేది లేదని సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఐసిడిఎస్ అధికారులు మంగళవారం, బుధవారం నోటీసులు ఇవ్వకుండానే వెనుతిరిగారు.

**రిజిస్టర్ పోస్టులో నోటీసులు జారీ**

అంగన్‌వాడీలు నోటీసులు తీసుకోకపోవడంతో అధికారులు కొత్త పోకడకు తెరలేపారు. ఈ క్రమంలో ఐసిడిఎస్ అధికారులు జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలందరికీ రిజిస్టర్ పోస్టుల ద్వారా నోటీసులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు మూడువేల మంది అంగన్వాడీలకు రిజిస్టర్ పోస్టుల ద్వారా నోటీసులు జారీ చేసినట్లు ఐసిడిఎస్ పిడి సుజాత రాణి తెలిపారు.

**అంగన్వాడీల గృహాలు, కేంద్రాలకు నోటీసులు అంటించిన అధికారులు**

అంగన్‌వాడీలు నోటీసులు తీసుకునేందుకు నిరాకరించడంతో అంగన్వాడీలు ఇళ్లకు, అంగన్వాడీ కేంద్రాలకు అధికారులు నోటీసులు అంటించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1674 అంగన్వాడీ కేంద్రాలకు, 3 వేల అంగన్వాడీల గృహాలకు నోటీసులు అంటించారు. పలు ప్రాంతాల్లో అభ్యంతరాలు వ్యక్తం కావడంతో గేటుకు, ప్రహరీ గోడలకు అంటించారు.

## నిరుద్యోగులపై ప్రభుత్వం ఉక్కుపాదం

**విజయవాడ వెళ్లకుండా డివైఎఫ్ఐ నేతలకు నోటీసులు**

**విజయవాడలో పలువురు జిల్లా నేతల అరెస్టు**

ప్రజాశక్తి - భీమవరం

సమాజంలో స్వేచ్ఛను హరించే విధంగా వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, యువత సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం హక్కులను హరించే విధంగా పోలీసులతో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అరెస్టుల పరంపర కొనసాగిస్తోంది. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని విజయవాడ సిఎం క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే దీన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని విధించింది. జిల్లాలో డివైఎఫ్ఐ నేతలకు ముందస్తు నోటీసులు జారీ చేసింది. చలో విజయవాడ వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఆకివీడులో డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల ధనుష్‌కు పోలీసులు నోటీసులు జారీ చేసి గృహ నిర్బంధం చేశారు. చలో విజయవాడ వెళ్లిన జిల్లా అధ్యక్షులు శర్మను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ చర్యలను డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వం యువత పట్ల చిన్న చూపు చూస్తోందని విమర్శించింది. మోసపూరిత హామీలతో యువతను నిలువునా మోసం చేయడాన్ని జిల్లా కమిటీ ఖండించింది. అధికారంలోకి వచ్చిన తరువాత డిఎస్‌సి విడుదల చేయకుండా మా ఉద్యోగం ఎక్కడ జగన్ అని అడిగినందుకు అరెస్ట్‌లు చేయడమేంటని జిల్లా కమిటీ ప్రశ్నించింది. రాష్ట్రంలో సుమారు 8 నుండి 9 లక్షల మంది అభ్యర్థులు నోటిఫికేషన్ రాక మగ్గిపోతున్నారని తెలిపారు. వివిధ పాలసీల పేరిట ఉద్యోగ నియామకాల సంఖ్యను కుదించి ఉద్యోగులను మోసం చేయడాన్ని తప్పు పట్టింది. నిరుద్యోగ యువత ఆత్మ హత్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించింది. నాయకులు, అభ్యర్థుల అరెస్టులు మానుకుని తక్షణం మెగా డిఎస్‌సి విడుదల చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.



పోలీసు నుంచి నోటీసు తీసుకుంటున్న డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుష్

## పరిష్కారంలో కాలయాపన తగదు

**కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె**

ప్రజాశక్తి - తణుకు రూరల్



తణుకులో కుర్చీలు తిరగేసి పట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

తమ సమస్యలు పరిష్కరించకపోతే 'మీ కుర్చీ తిప్పేస్తాం' అంటూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బుధవారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా కుర్చీలను తిరగేస్తూ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కామన మునిస్వామి, గుబ్బల గోపి, యూనియన్ నాయకులు మజ్జి కృష్ణబాబు, నీలాపు ఆదినారాయణ బాబు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం** : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ పట్టణంలో మున్సిపల్ కార్మికులు బుధవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 16 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా సమస్యలు పరిష్కరించకపోగా సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నాయకులు ఎస్.సతీష్, దనాల రాజు, భాను, దయామని, దుర్గాప్రసాద్ నాయకత్వం వహించారు. సమ్మెకు ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి దాన వరప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ కాంటాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఐఎఫ్‌టియు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.

**భీమవరం రూరల్:** మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో జగన్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమ్మె 16వ రోజు సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ఒంటి కాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడారు. వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు, ఎఐసిటియు జి.నాని, నేలపు రాజు, ఎస్‌కె నాగూర్ నాగమణి, సత్యనారాయణ, నేలపు అప్పన్న పాల్గొన్నారు.

## సమస్యలపై సానుకూలంగా స్పందించాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం**

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

నెల రోజుల నుంచి శాంతియుతంగా పోరాడుతున్న అంగన్వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. జిల్లాలో జరుగుతున్న సమ్మె, ఆందోళనలకు మద్దతుగా బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు కన్నతల్లుల్లా పిల్లలకు, మహిళలకు, గర్భిణులకు సేవలందిస్తున్నారన్నారు. వారి సేవలను అనేక రకాలుగా ప్రభుత్వం ఉపయోగించుకుంటోందని తెలిపారు. జగన్ ఇచ్చిన హామీని అమలుచేయాలని మాత్రమే అడుగుతున్నారని తెలిపారు. వేతనం, గ్రాట్యూటీ పెంచాలని డిమాండ్ చేశారు. న్యాయమైన పోరాటం చేస్తున్న వారిపై ఎస్మా ప్రయోగం దారుణమన్నారు. తక్షణం ఎస్మా ప్రయోగాన్ని విరమించుకోవాలని, జిఒ 2ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు మున్సిపల్ కార్మికులు కూడా 15 రోజులుగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో చెత్త పేరుకుపోయిందని ప్రభుత్వం వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే అన్ని రాజకీయ పార్టీలనూ కలుపుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జెక్కంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, కార్యకర్తలు రత్నకుమారి, లత, నాగరాజు పాల్గొన్నారు

## గంగిరెద్దుకు ఎస్ఎస్ఎ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్



గంగిరెద్దుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు చేపట్టిన సమ్మె బుధవారానికి 22వ రోజుకు చేరింది. బుధవారం రాజా రామ్మోహన్ రాయ్ సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఒక పక్క అంగన్వాడీలు, మరో పక్క సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడం మాని ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. శ్రామికుల శ్రమను దోచుకునే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలూ కాలగర్భంలో కలిసిపోయాయన్నారు. శిబిరం వద్ద ఉద్యోగ జెఎసి జిల్లా అధ్యక్షులు షేక్ బావాజీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం గంగిరెద్దుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసు సంతోషి, కె.శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఆర్‌టిసిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సర్క్యూలర్ ప్రకారం జీతాలివ్వాలని ఆర్‌టిసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ వి.తులసీదాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తణుకు ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం కల్పించిన జీతం కాంట్రాక్టుదారులు ఇవ్వడం లేదని వారు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెలవులు కూడా అమలు జరగడంలేదన్నారు. రూ.26,000 వేల జీతం ఇవ్వాలని అది కూడా ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కామన మునిస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

**నరసాపురం టౌన్** : ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్‌టిసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ వి.తులసీరామ్, ఆర్‌టిసి డిపో గౌరవ అధ్యక్షులు, సిఐటియు పట్టణ కమిటీ కార్యదర్శి పొన్నాడ రాము ఆధ్వర్యంలో నరసాపురం డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్క్యులర్ ప్రకారం ప్రతి నెలా 10వ తేదీలోపు కార్మికుల అకౌంట్లో జీతాలు జమ చేయాలన్నారు. ఆరు నెలలకు విడుదలయ్యే నోటిఫికేషన్లు నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. కనీస వేతనం 26,000 చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తానని, మిగిలిన సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని హామీ ఇచ్చారు.

## జీతాలు చెల్లించాలని మిడ్డేమీల్స్ కార్మికుల వినతి

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)


మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో జీతాలను తక్షణమే చెల్లించాలని మిడ్డే మీల్స్ జిల్లా అధ్యక్షురాలు ఎ.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ దండు అశోక్‌వర్మకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాసప్రసాద్, మధ్యాహ్న భోజన కార్మికులు షేక్ మీరాబీ, మంగతాయారు, సువార్త, నాగమణి, దుర్గ, పద్మ పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సాయం

**కాళ్ల** :మండలంలోని దొడ్డనపూడి గ్రామానికి చెందిన షేక్ బాజీ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. షేక్ బాజీ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సర్పంచ్ కొల్లి సుబ్బారావు రూ.10 వేల ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. భాస్కిన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరేటి పద్మారావు చేతులమీదుగా రూ.పది వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సతీష్, వాసు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**కాళ్ల** :అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఆక్వా సలహా మండల సభ్యులు పెన్మెత్స దుర్గాప్రసాదరాజు అన్నారు. కలవపూడి పంచాయతీ కార్యాలయంలో బుధవారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా కొత్తగా మంజూరైన 19 మంది పింఛన్‌దారులకు రూ.3 వేల సర్పంచ్ గేదల జాన్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు నాగరాజు, తోటకూర చిన్నా, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న జాన్


## 'వైఎస్ఆర్ బీమా పేదల పాలిట వరం'

**ఆచంట** :వైఎస్ఆర్ బీమా పథకం పేదల పాలిట వరమని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. మండలంలోని కొడమంచిలి గ్రామానికి చెందిన మేకా శ్రీను, పలివెల లక్ష్మీకుమారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబానికి ప్రభుత్వ పరంగా వైఎస్ఆర్ బీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు చెరో రూ.లక్ష చొప్పున బుధవారం అందజేశారు.

## పిల్లల్లో సంస్కృతి సంప్రదాయాలు పెంపొందించాలి

ప్రజాశక్తి - కాళ్ల

పిల్లల్లో విద్యార్థి దశ నుంచి సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐఐటి బొంబాయి ప్రొఫెసర్ డాక్టర్ వివిఎస్.రాజు అన్నారు. వేంపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(హెచ్)ను గ్రామ ప్రముఖులు బుధవారం సందర్శించారు. పిల్లల డాక్టర్ రామకృష్ణంరాజు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించారు. రిటైర్డ్ జెడిఎ పల్లంరాజు, ఎంఇఒ-2 జి.కనకరాజు, ప్రధానోపాధ్యాయులు బి.నాగముకుందశ్రీనివాసరావు మాట్లాడారు. ఉపాధ్యాయుని పి.వి.వరలక్ష్మి ప్రాథమిక స్థాయిలో టిఎల్ఎం ద్వారా బోధన చేయడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చని రకరకాల టిఎల్ఎం ప్రదర్శించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్యనారాయణరాజు, రామరాజు, వేణురాజు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు బంగార్రాజు, జ్యోతి, మమత పాల్గొన్నారు.


హిందూ పాఠశాలలో గ్రామ ప్రముఖులు

## అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

**ఉండి** :అభివృద్ధి, సంక్షేమం రెండు ప్రభుత్వానికి రెండు కళ్లు అని డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఉండి నుంచి వాండ్రం వెళ్లే రహదారి పున:నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉండి నుంచి వాండ్రం వెళ్లే రహదారి పూర్తిగా అధ్వాన స్థితికి చేరుకుంటే సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లామని, ప్రత్యేక నిధుల నుంచి సిఎం జగన్ రూ.కోటి నిధులు మంజూరు చేశారని చెప్పారు. త్వరలోనే నియోజకవర్గంలో మరిన్ని రహదారుల పున:నిర్మాణానికి శంకుస్థాపన చేసి మార్చి నెలాఖరులోగా నిర్మిస్తామన్నారు.

## తాగునీటి సమస్యకు పరిష్కారం

**భీమవరం రూరల్** :పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా పూర్తిస్థాయిలో పరిష్కరించేలా ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ బుధవారం బృహత్తర మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. పట్టణంలో సుమారు మూడు లక్షల మంది ప్రజలకు ఒకే సమయంలో తాగునీరు సరఫరా చేయడంతో పాటు ప్రతిరోజు పట్టణ ప్రజలకు సరఫరా చేసే 1.70 కోట్ల లీటర్ల నీటి సామర్థ్యాన్ని 3.50 కోట్ల లీటర్ల వరకు పెంచుతూ రూ.37 కోట్లతో నిర్మించిన బృహత్తర మంచినీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పట్టణంలో 1, 4, 5 వార్డుల్లో సుమారు రూ.1.70 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.

## తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి తనిఖీలు

**పెనుగొండ**: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను ఎసిబి అధికారులు తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ రికార్డులను ఎసిబి అధికారులు శరత్‌బాబు, నాగేంద్రబాబు, శివప్రసాద్ పరిశీలించారు.

## 20న ఆక్వా రైతుల 2కె ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన పాలకొల్లులో 2 కె ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జైభారత్ క్షీర రామ ఆక్వా రైతుసంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు చెప్పారు. సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై ర్యాలీగా వెళ్లి తహశీల్దార్, ఫిషరీస్ శాఖ అధికారులకు వినతిపత్రం అందిస్తామని చెప్పారు. సంఘం నేతలు కోడి విజయభాస్కర్, రుద్రరాజు సత్యనారాయణ రాజు, మేడిది జాన్‌సన్, మేకా ఫణీంద్ర, దాట్ల సోమేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాంధీ భగవాన్‌రాజు

## కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎ.సుబీల్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని కలగంపూడిలో కోడిపందేల నిర్వహణ చేసే అవకాశాలున్న అనుమానిత ప్రాంతాల్ని బుధవారం పరిశీలించారు. ఆయనతో పాటు యలమంచిలి ఎస్ఐ కె శివన్నారాయణ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.


యలమంచిలి : స్థలాలను పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎస్ఐ

**పాలకొల్లు రూరల్** :మండలంలో సంక్రాంతి పండగ పేరుతో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని తహశీల్దార్, గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## బైక్ చోరులు అరెస్టు

**పెనుగొండ** :పెనుగొండ పరిసర ప్రాంతాల్లో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్‌విపిఐ కళాశాల సెంటర్‌లో తనిఖీలు చేస్తుండగా ఇద్దరు యువకులు బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. మార్టేరు గ్రామానికి చెందిన చిర్ల జగన్మోహన్‌రెడ్డి, అతని స్నేహితుడు వెలగలేరు గ్రామానికి చెందిన నీలపు హర్షవర్ధన్‌రెడ్డిల వద్ద నుంచి ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారు రాత్రి సమయంలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాలను మారు తాళం తీసి దొంగతనం చేశారని తెలిపారు.



# సమస్యలు పరిష్కరించేవరకూ ఉద్యమం

## 30వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె


భీమవరంలో...

**తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారంతో 30వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించేవరకూ సమ్మె కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.**

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో అంగన్‌వాడీల సమ్మెను సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, రాయ్ ప్రారంభించారు. సమ్మెకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, అధ్యక్షులు జిత్తిగ నరసింహ మూర్తి, ఉపాధ్యక్షులు చింతకాయలు బాబూరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం మండల నాయకులు, 108 నాయ కులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ జిల్లా కార్యదర్శి కల్యాణి, అధ్యక్షులు ఝాన్సీ హసీనా, జి.విజయలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, దుర్గ, మేరీ గ్రేస్, మాధవి పాల్గొన్నారు.

**ఆచంట** : అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఎస్మా చట్టాన్ని తక్షణమే విరమించుకోవాలని ఆశా కార్యకర్తల జిల్లా ప్రధాన కార్యదర్శి దిగుపాటి జ్యోతి డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆచంట కచేరి సెంటర్‌లో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం 30వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీల సమ్మెకు ఆశా కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆచంట కచేరి సెంటర్‌లో సిఎం డౌన్ డౌన్, ఎస్మా చట్టాని తక్షణమే రద్దు చేయాలి, ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి, సిగ్గు సిగ్గు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, ఆశా కార్యకర్తల మండల అధ్యక్షురాలు నక్కా శైలజ, కోరుమిల్లి లక్ష్మీపార్వతి, నాగకుమారి, కనకదుర్గ నాగమణి పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం** : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు గడ్డిని తింటూ, కోలాటం నృత్యాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీల యూనియన్ నాయకురాలు రాజేశ్వరి, అంగన్వాడీ వర్కర్స్ ప్రాజెక్టు అధ్యక్షురాలు దీన స్వరూపారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు యడవల్లి వెంకట దుర్గారావు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

**గణపవరం** : గణపవరంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఆంజనేయులు మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీలపై నిర్బంధాలు విధిస్తే ఉద్యమ బాట వదిలిపెట్టేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు మహాలక్ష్మి, సీతామహాలక్ష్మిచ పార్వతి, నాగమణి, రమణ పాల్గొన్నారు.

**కాళ్ల** : కాళ్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మెకు కాళ్ల మండల ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యిర్రింకి ఏడుకొండలు, మునగాల నాగలక్ష్మి సంఘీభావం తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నుంచి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం దాసరి వెంకటేశ్వరరావు, ఈదా రవికుమార్, కొల్లి వెంకటదుర్గాభవాని, గంటా భవాని, డి.రాజా పాల్గొన్నారు.


తణుకులో...

**తణుకు రూరల్** : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మహాత్మ గాంధీకి చేతులు ఎత్తి దండాలు పెట్టారు. సమస్యలు పరిష్కరించాలని, వైసిపి ప్రభుత్వానికి బుద్ధి ఇవ్వాలని, ఇచ్చిన మాట అమలు చేయాలని, ఎస్మా రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండలాధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ఆదినారాయణబాబు, గుబ్బల గోపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నా యకులు రంగారావు, జ్యోతి, మణిమాలతి, ప్రమీల, కనక దుర్గ, వసంతకుమారి, ధనలక్ష్మి, సత్యవతి, రజని పాల్గొ న్నారు.

**పోడూరు** : పోడూరులో అంగన్‌వాడీలు 30 అకారంలో కూర్చుని తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి, సిఐటియు నాయకులు పిల్లి ప్రసాద్, బూరాబత్తుల వెంకటరావు పాల్గొన్నారు.

**యలమంచిలి**:యలమంచిలిలో అంగన్‌వాడీలు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ మాట్లాడుతూ అంగన్వాడీలపై ప్రభుత్వం విధించిన ఎస్మా చట్టాన్ని వెంటనే రద్దుచేసి, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజిని, దేవి పాల్గొన్నారు.


పాలకొల్లులో...

**పాలకొల్లు** : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు.

**మొగల్తూరు** : మొగల్తూరులో అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చుని నిరసన ప్రదర్శన చేశారు. తమ సమస్యల పరిష్కారానికి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీత, జ్యోతి, సారమ్మ, అనురాధ, వెంకటరమణ పాల్గొన్నారు.

**పెనుగొండ** : మండలంలోని పంచాయతీ పార్కు వద్ద సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగలక్ష్మి మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**ఆచంట (పెనుమంట్ర)** : పెనుమంట్రలో అంగన్‌వాడీలు ఆటపాటలతో తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకురాలు ఎ.అజయ్‌కుమారి మాట్లాడారు. సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాసప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ సంఘీభావం తెలిపారు.

**అత్తిలి** : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. మండలంలోని అంగన్‌వాడీలు కార్యకర్తలు, సహాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాంబాబు, కౌలు రైతు సంఘ: నాయకులు కేతా గోపాలన్ పాల్గొన్నారు.

**నరసాపురం టౌన్** : అంబేద్కర్ కూడలిలో రిలే నిరాహార దీక్షకు సిఐటియు రాష్ట్ర నాయకులు తులసీరామ్, జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, అంగన్వాడీ ఉద్యోగులు ఆకుల లలిత, గన్నాబత్తుల వెంకటలక్ష్మి, నీలిమ, రాజేశ్వరి, శ్రీలక్ష్మి, నిర్మలకుమారి పాల్గొన్నారు.

**ఉండి** : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు చైతన్య, సత్యవేణి, గడి కుసుమ, వీరవల్లి వెంకటలక్ష్మి, శ్యామల, కుసుమ, చిట్టి మరియా, ప్రేమలత, లలిత పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు అనువైన ప్రాంతం పరిశీలించాలి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం నుంచి అందిన జర్నలిస్టుల అర్హుల జాబితాను పరిగణలోకి తీసుకుని అనుకూలమైన ప్రాంతాన్ని పరిశీలించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు గుర్తింపు అంశంపై అధికారులు, పాత్రికేయ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్ట్ సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలో జర్నలిస్టులకు కేటాయించాల్సిన స్థలాలను గుర్తించి, చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

## 'ఆడుదాం ఆంధ్రా'లో సౌకర్యాల కొరత

### క్రీడాకారుల ఆవేదన

ప్రజాశక్తి - ఉండి

పల్లెల్లో క్రీడా మాణిక్యాలను వెలికి తీస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని రూపొందిస్తే అధికారులు ఆ కార్యక్రమం ఆశయాన్ని నీరుగారుస్తున్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ప్రచారం భారీ స్థాయిలో ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ సౌకర్యాలు కల్పించడంలేదని మండలంలోని చెరుకువాడలో క్రీడాకారులు చెబుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటలు పోటీలు నిర్వహిస్తున్న కనీసం మంచినీరు కూడా అందించడం లేదని వాపోయారు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి పోలీసులతో తమపై దాడి చేయించారని వారు ఆరోపించారు. జరిగిన సంఘటన చిత్రీకరిస్తుంటే గ్రామ మహిళా పోలీస్ సెల్‌ఫోన్ లాక్కుని మహిళా క్రీడాకారులపై దౌర్జన్యానికి దిగారని వాపోయారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని, క్రీడలను సక్రమమైన పద్ధతిలో నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


విద్యార్థిని అభినందించిన హెచ్‌ఎం కృష్ణమూర్తి

## జాతీయ క్రికెట్ పోటీలకు పాలకొల్లు విద్యార్థి

ప్రజాశక్తి - పాలకొల్లు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరంలో నిర్వహించిన అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో ఎవిఎస్ఎన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి షేక్ సమీరుద్దీన్ నేషనల్ క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యాడు. ఈ నెల 16 నుంచి 24 వరకు బీహార్ రాజధాని పాట్నాలో జరిగే జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో ఆడనున్నాడు. సమీరుద్దీన్‌ని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోపీ, మేకా శేషుబాబు, యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు, మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.విష్ణుమూర్తి, పీడీ వి.పేర్రాజు అభినందించారు.

## అనారోగ్యంతో సాక్షి విలేకరి మృతి

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని కరుగోరిమిల్లి గ్రామానికి చెందిన సాక్షి ఆచంట నియోజకవర్గ విలేకరి అడబాల యజ్ఞవిజయ్‌కుమార్ (44) అనారోగ్యంతో భీమవరం ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య శాంత కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఆచంట నియోజకవర్గ ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి విజయకుమార్ మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, నాయకులు ముత్యాల నాగేశ్వరరావు, మొల్లేటి రామకృష్ణ, నియోజకవర్గ మీడియా, పత్రిక విలేకరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## పోలింగ్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పన

ప్రజాశక్తి - భీమవరం

పోలింగ్ స్టేషన్లలో అవసరమైన మౌలిక సదుపాయాలను నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సంబంధిత ఎన్నికల అధికారులతో సమావేశమై పోలింగ్ స్టేషన్‌లలో ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులపై సమీక్షించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వికలాంగులకు వీలుగా ర్యాంపును సిద్ధం చేయాలన్నారు.




పురస్కారం అందిస్తున్న ఆలపాటి శివయ్య

## శ్రీ వాసవి ఫార్మసీ కళాశాలకు పురస్కారాలు

**తాడేపల్లిగూడెం** :తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలకు మూడు విభాగాల్లో ఐఎస్ఒ పురస్కారాలు లభించాయని పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు తెలిపారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన ఐఎస్ఒ పురస్కార కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఐఎస్ఒ ఆడిట్ సంస్థ హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య చేతుల మీదుగా ఈ సర్టిఫికేషన్లను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరరాజు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు

**ఆచంట** :అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించడం నిరంతర ప్రక్రియ అని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో పెనుమంట్ర మండలం నెగ్గిపూడి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారులు ఇంటి పట్టా కోసం ఆయా గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు.


కాళ్లలో...

## 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయమని కలవపూడి సర్పంచి జాన్ అన్నారు. కలవపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆయన బుధవారం పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా ఆక్వా సలహా మండల సభ్యులు పెన్మెత్స దుర్గాప్రసాదరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు నాగరాజు, తోటకూర చిన్నా, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

**ఆచంట** : విజయవాడలో నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ 19వ తేదిన ఘనంగా నిర్వహించనున్నట్లు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**నరసాపురం రూరల్** : అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ కార్యక్రమం మండలంలోని చిట్టవరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.